# అభ్యుదయం

The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263

ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ   బుధవారం 30- 9- 2026   సంపుటి : 6   సంచిక : 230  ఎడిటర్ : ఆనంద్ రావు   పేజీలు : 8  వెల : 3-00


# మయన్మార్‌లో వైమానిక దాడి..

## - అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి
## -49 మంది మృతి, 58 మందికి గాయాలు



మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యౌక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది.

మిగతా 2లో

# తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

- గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి
- ఇన్వెస్టర్స్ సద్వినియోగం చేసుకోవాలి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ వెల్లడి
- తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటన
- భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భేటీ
- వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చ




# తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

- పీఆర్‌ఎల్‌ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
- పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- మంత్రి సీఆర్ పాటిల్ తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం



న్యూఢిల్లీ,**అభ్యుదయం**

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్

మిగతా 2లో

# ఈ ఖరీఫ్‌లో తెలంగాణలో పప్పుధాన్యాల సాగు వృద్ధి

- 36%తో దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ
- రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి
- రైతులకు రియల్‌టైమ్‌లో నేల ఆరోగ్య సమాచారం
- శాటిలైట్ ఆధారిత సాయిల్ హెల్త్ టెక్నాలజీ రావాలి
- క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించాలి
- గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలి
- రబీ సదస్సులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పామాయిల్ ధరలపై ప్రత్యేక కమిటీ వేస్తాం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ
- శివరాజ్ సింగ్ చౌహాన్ తో మంత్రి తుమ్మల భేటీ



న్యూఢిల్లీ**అభ్యుదయం:** పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగు గత ఖరీఫ్‌తో పోలిస్తే 36 శాతం పెరిగి, దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ నిలిచిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రబీ సదస్సులో తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతిని వివరించడంతో పాటు, రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు

- మిగతా 2లో పేజీలో

# అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

- నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకోబోం
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలి
- ప్రత్యర్థులకు కొండా సురేఖ హెచ్చరికలు



హైదరాబాద్, **అభ్యుదయం**

: మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# పాలనలో కొత్త ఒరవడి...

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- టెక్నాలజీతో పాలనా విధానాలు మరింత సరళీకృతం
- పౌరసేవల్లో నాణ్యతే సామర్థ్యాల పెరుగుదలకు గీటురాయి
- మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ తొలి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి మొదటి స్థానం,
- తదుపరి స్థానాల్లో కర్ణాటక, ఒడిశా
సీఎం చేతుల మీదుగా అవార్డులు
- అందుకున్న మూడు రాష్ట్రాల అధికారులు



విజయవాడ,**అభ్యుదయం** దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను

మిగతా 2లో



## పేదల కన్నీటికి విలువ కట్టలేం..

- ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం
- పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

2లో

అభ్యుదయం
The Pride of Telugu national daily

బుధవారం 30-9-2026

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

"ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

## మయన్మార్‌లో వైమానిక దాడి..

మయన్మార్,సెప్టెంబర్ 29 మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్యాన్ ఆంగ్ మృతుల సంఖ్యను ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం,

వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది

. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యాక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

## గరిష్ట స్థాయికి విద్యుత్ వినియోగం

హైదారాబాద్, సెప్టెంబర్ 29 తెలంగాణలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల నుంచి పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లు విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరిగింది. తాజాగా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ( టీజీఎస్‌పీడీసీఎల్ ) పరిధిలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. మంగళవారం మధ్యాహ్నం 3.52 గంటలకు ఏకంగా 12,044 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. టీజీఎస్‌పీడీసీఎల్ చరిత్రలో ఇదే అత్యధిక డిమాండ్‌గా విద్యుత్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఇంతకుముందు అత్యధికంగా 11,828 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 12.44 గంటలకు ఈ రికార్డు నమోదైంది. తాజాగా 12,044 మెగావాట్లకు డిమాండ్ చేరడంతో పాత రికార్డు అధిగమించబడింది. అంటే గత గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే తాజాగా మరో 216 మెగావాట్ల మేర విద్యుత్ అవసరం పెరిగింది. ఒక్కసారిగా వినియోగం పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి పెద్ద సాంకేతిక అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగినట్లు సంస్థ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం గణనీయంగా నమోదవుతోంది. సెప్టెంబర్ 29 (మంగళవారం) సాయంత్రం 6.42 గంటలకు 4,072 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైంది. అదే రోజు జీహెచ్‌ఎంసీ పరిధిలో 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక డిమాండ్ మే 22వ తేదీన నమోదైంది. ఆ రోజు సాయంత్రం 3.33 గంటలకు 4,782 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైంది. అదే రోజున 101.07 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. తెలంగాణ మొత్తం మీద కూడా విద్యుత్ అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. తెలంగాణ ట్రాన్స్‌కో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 29 (మంగళవారం)న మధ్యాహ్నం 12.56 గంటలకు రాష్ట్రంలో 19,133 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా 326.70 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ంది.

## పేదల కన్నీటికి విలువ కట్టలేం..



హైదారాబాద్, సెప్టెంబర్ 29: ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

# పాలనలో కొత్త ఒరవడి... నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి



సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల-2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.

### కెపాసిటీ బిల్డింగ్ లో ఏపీకి మొదటి స్థానం

ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సీఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. పూర్తి చేసుకున్న శిక్షణతో పౌరులకు నాణ్యమైన సేవలు అందుతున్న తీరుకు కొలమానంగా ఉండాలని సూచించారు.

## తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

ఫ్రాంక్‌ఫర్ట్, జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.

# ఈ ఖరీఫ్‌లో తెలంగాణలో పప్పుధాన్యాల సాగు వృద్ధి

ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగి, గత ఏడాదితో పోలిస్తే 36 శాతం వృద్ధితో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. తెలంగాణలో కూరగాయల సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 8,800 ఎకరాల లక్ష్యాన్ని లక్ష ఎకరాలకు పెంచేందుకు కేంద్రం అనుమతితో పాటు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. పెరుగుతున్న కూరగాయల డిమాండ్‌ను తీర్చడంతో పాటు పంటల వైవిధ్యీకరణకు ఇది దోహదపడుతుందని తెలిపారు.

ఎల్‌నినో పరిస్థితులు, మారుతున్న వర్షపాత సరళి, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల కారణంగా తెలంగాణలోని అనేక మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటున్నాయని మంత్రి తెలిపారు. ఆయా మండలాలకు సూక్ష్మ సాగునీరు, రక్షిత సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాల కోసం ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా ఎల్‌నినో, కరువు పరిస్థితులను ఎదుర్కొనే ప్రత్యేక చర్యగా మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం (గ్రూూ) పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నీటి ఒత్తిడిని తట్టుకునే జొన్న కరువు ప్రభావిత ప్రాంతాలకు అనుకూలమైన పంట కావడంతో కనీసం జొన్ననైనా పీఎస్ఎస్‌లో చేర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ తెలంగాణలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట కావడంతో రైతులు సులభంగా మరో పంటకు మారే అవకాశం ఉండదని, అందువల్ల రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు కల్పించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని మంత్రి శ్రీ తుమ్మల కేంద్రాన్ని కోరారు. దేశీయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న సమయంలో దిగుమతి విధానాలు కూడా దేశీయ రైతులకు అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీని నియమించి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి శ్రీ తుమ్మల తెలిపారు.

సాంప్రదాయ మట్టి పరీక్షల ద్వారా ప్రతి రైతుకు సకాలంలో నేల ఆరోగ్య సమాచారం అందించడం సాధ్యం కావడం లేదని మంత్రి తెలిపారు. రైతులకు రియల్‌టైమ్‌లో నేల ఆరోగ్య వివరాలను అందించేందుకు శాటిలైట్ ఆధారిత సాయిల్ హెల్త్ టెక్నాలజీని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి



152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

................

# ఫిక్సుడ్ డిపాజిట్లపై కొత్త రూల్స్..



బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే పెద్ద మొత్తపు డిపాజిటర్ల కోసం ఆర్‌బీఐ కొత్త నిబంధనల ను తీసుకొచ్చింది. ఈ మార్పులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. బ్యాంకులు అందించే వడ్డీ రేట్ల (×త్వతీవర్ తీఘ్వం) లో మరింత పారదర్శకత, స్థిరత్వం తీసుకురావడమే ఈ కొత్త విధానం ప్రధాన లక్ష్యమని తెలుస్తున్నది. ముఖ్యంగా రూ.3 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన టర్మ్ డిపాజిట్ల ను 'బల్క్ డిపాజిట్లు )' గా పరిగణిస్తారు. ఈ కొత్త నిబంధనలు ప్రధానంగా ఇలాంటి పెద్ద డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడ్డాయి.వచ్చే నెల 1 నుంచి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు సహా నిర్దేశిత ఆర్థిక సంస్థలన్నీ తమ బల్క్ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను ప్రతి పనిదినం ఉదయం 10 గంటలలోపు అధికారిక వెబ్‌సైట్లలో ప్రచురించాలి. ఒకవేళ ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే అందుకు 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే వెబ్‌సైట్‌లో ప్రకటించిన వడ్డీ రేటునే ఆ రోజు డిపాజిట్ చేసే కస్టమర్లకు తప్పనిసరిగా చెల్లించాలి. దీనివల్ల రేట్ల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావుండదు. ఇప్పటివరకు ఒకే బ్యాంకుకు చెందిన వేర్వేరు బ్రాంచ్‌లలో ఒకే రకమైన బల్క్ డిపాజిట్‌కు స్వల్పంగా వేర్వేరు వడ్డీ రేట్లు ఇచ్చే అవకాశం ఉండేది.

అయితే తాజా నిబంధనలతో ఆ పద్ధతికి తెరపడింది. కొత్త నిబంధన ప్రకారం.. ఇకపై ఒకేరోజు ఒకే బ్యాంకుకు చెందిన ఏ బ్రాంచ్‌లోనైనా ఒకే రకమైన డిపాజిట్‌కు ఒకే వడ్డీ రేటును అందించాల్సి ఉంటుంది. ఇది బ్రాంచ్‌ల మధ్య వివక్షను తొలగించి, డిపాజిటర్లకు ఏకరూపతను అందిస్తుంది. ఈ కొత్త నిబంధనల వల్ల చిన్న, మధ్యతరగతి రిటైల్ డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. ఈ మార్పులు కేవలం రూ.3 కోట్లు, ఆపైన చేసే బల్క్ డిపాజిట్లకు మాత్రమే వర్తిస్తాయి. సాధారణ ఎఫ్‌డీ కస్టమర్లకు ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు, వడ్డీ రేట్లు యథాతథంగా కొనసాగుతాయి. ఇప్పటికే చేసిన పాత ఎఫ్‌డీలపై వాటి కాలపరిమితి ముగిసే వరకు ఒప్పందం ప్రకారం పాత వడ్డీ రేట్లే వర్తిస్తాయి. ఈ నిబంధనలు వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, లోకల్ ఏరియా బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులకు వర్తిస్తాయి.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

### హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి




కరీంనగర్, సెప్టెంబర్ 29: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలో అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులతో భరోసానిస్తోందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మడిపల్లి, మాచనపల్లి, సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, తనుగుల, వావిలాల, గండ్రపల్లి గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేద కుటుంబంలో ఒక వ్యక్తికి అనారోగ్యం వస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని, అలాంటి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఖరీదైన వైద్య చికిత్సల కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం కొంత ఆర్థిక ఉపశమనం కల్పిస్తుందని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ఏ సమయంలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య చికిత్సకు ఖర్చు చేసిన సమయంలో తమకు అందిన ఈ ఆర్థిక సహాయం ఎంతో అండగా నిలుస్తుందని, తమ కుటుంబంపై ఉన్న ఆర్థిక భారాన్ని కొంత మేర తగ్గించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## గణేశ్ ఉత్సవాల్లో షీ టీమ్స్ నిఘా.. 2,935 మంది ఆకతాయిల గుర్తింపు

- హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాల సందర్భంగా మహిళలను వేధించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. 2,935 మంది ఆకతాయిలను గుర్తించి నిందితులకు శిక్షలు పడేలా చేశారు.
- గణేశ్ ఉత్సవాల్లో షీ టీమ్స్ నిఘా.. 2,935 మంది ఆకతాయిల గుర్తింపు




హైదరాబాద్: గణేశ్ ఉత్సవాల సందర్భంగా మహిళలు, యువతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ మండపాల వద్ద షీ టీమ్స్‌ను భారీగా మోహరించి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 14 నుంచి 26 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘాలో 2,935 మంది ఆకతాయిలను షీ టీమ్స్ గుర్తించాయి. వీరిలో పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించగా.. మరికొందరిపై కేసులు నమోదు చేసి, శిక్షలు పడేలా చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఉత్సవాల వేళ మహిళలతో అనుచితంగా ప్రవర్తించిన 858 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు

అనంతరం వారిని గట్టిగా హెచ్చరించి విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. అలాగే, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించిన వారిలో 69 మందికి శిక్ష విధించినట్లు వెల్లడించారు. ఇందులో 24 మందికి రూ.1,050 జరిమానా విధించగా.. మరో 40 మందికి సామాజిక సేవతో పాటు రూ.1,050 జరిమానా విధించినట్లు తెలిపారు

. మరో ఐదుగురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు వివరించారు. పండుగల సమయంలో యువత భక్తిశ్రద్ధలతో ఉండాలని, అంతేకానీ మహిళలను వేధించడం సరికాదని పోలీసులు పేర్కొన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే ఆకతాయిలను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

## క్యాన్సర్ మందు తయారీ, అమ్మకానికి అంత వ్యత్యాసమా?..

### కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు..




న్యూఢిల్లీ: ఔషధాలు, వైద్య పరికరాల తయారీ, అమ్మకం ధరల వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యంగా క్యాన్సర్ మందుల తయారీ ధరకు, వాటి ఎమ్మార్పీ (వీ౯ా)కి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించింది. మందులు, వైద్య పరికరాల ధరలపై దాఖలైన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం ఈరోజు (మంగళవారం) విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా క్యాన్సర్ మందు తయారీకి రూ.3 వేలు అవుతుండగా.. ఎమ్మార్పీ రూ.27 వేలుగా ఎలా నిర్ణయిస్తారంటూ కేంద్రాన్ని నిలదీసింది.మందులు, వైద్య పరికరాలను నిత్యావసర సరకులుగా పరిగణించి, వాటి ధరలను నియంత్రించేందుకు మరింత సమర్థవంతమైన విధానం ఎందుకు తీసుకురావడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఔషధాల ధరల విషయంలో 16 శాతం పరిమితిని (క్యాపింగ్) ఎందుకు అమలు చేయడం లేదనీ ఆరా తీసింది. క్యాన్సర్ మందుల ఎమ్మార్పీలు వాటి తయారీ వ్యయంతో పోలిస్తే అనేక రెట్లు అధికంగా ఉండటంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని మందుల ధరలు తయారీ ధర కంటే పది రెట్లు అధికంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. ఇలాంటి భారీ వ్యత్యాసాలకు కారణమేంటని ప్రశ్నించింది. ప్రతి మందు, ప్రతి వైద్య పరికరం ప్రజలకు అవసరమైనదేనని.. అలాంటప్పుడు వాటిని డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (ఌూజూ) పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదని నిలదీసింది.ఔషధాల రీటైలర్ ధరపై 16 శాతానికి మించి లాభం ఎందుకు ఉండాలన్న అంశాన్నీ ధర్మాసనం ప్రస్తావించింది. అధిక ఎమ్మార్పీల కారణంగా ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా ఖర్చు చేస్తున్న ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని అభిప్రాయపడింది. ఈ అంశంపై దాఖలైన పిటిషనర్ల వాదనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు కోర్టుకు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఔషధ తయారీదారులు, విక్రేతలు, ఆస్పత్రులు, రోగులు వంటి అన్ని పక్షాల ప్రయోజనాలను కాపాడే మార్గం కనుగొంటుందని ఆయన చెప్పారు. అనంతరం తదుపరి విచారణను అక్టోబర్ 12కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## క్యాన్సర్ మందు తయారీ, అమ్మకానికి అంత వ్యత్యాసమా?

న్యూఢిల్లీ: ఔషధాలు, వైద్య పరికరాల తయారీ, అమ్మకం ధరల వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యంగా క్యాన్సర్ మందుల తయారీ ధరకు, వాటి ఎమ్మార్పీ (వీ౯ా)కి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించింది. మందులు, వైద్య పరికరాల ధరలపై దాఖలైన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం ఈరోజు (మంగళవారం) విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా క్యాన్సర్ మందు తయారీకి రూ.3 వేలు అవుతుండగా.. ఎమ్మార్పీ రూ.27 వేలుగా ఎలా నిర్ణయిస్తారంటూ కేంద్రాన్ని నిలదీసింది.మందులు, వైద్య పరికరాలను నిత్యావసర సరకులుగా పరిగణించి, వాటి ధరలను నియంత్రించేందుకు మరింత సమర్థవంతమైన విధానం ఎందుకు తీసుకురావడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఔషధాల ధరల విషయంలో 16 శాతం పరిమితిని (క్యాపింగ్) ఎందుకు అమలు చేయడం లేదనీ ఆరా తీసింది. క్యాన్సర్ మందుల ఎమ్మార్పీలు వాటి తయారీ వ్యయంతో పోలిస్తే అనేక రెట్లు అధికంగా ఉండటంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని మందుల ధరలు తయారీ ధర కంటే పది రెట్లు అధికంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. ఇలాంటి భారీ వ్యత్యాసాలకు కారణమేంటని ప్రశ్నించింది. ప్రతి మందు, ప్రతి వైద్య పరికరం ప్రజలకు అవసరమైనదేనని.. అలాంటప్పుడు వాటిని డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (ఌూజూ) పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదని నిలదీసింది.

## హకీంపేట కమాన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

హకీంపేట, సెప్టెంబర్ 29వనస్థలిపురం చింతల కుంట సమీపంలోని ప్రలవి గార్డెన్ యూటర్న్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో యమహా బైక్ షోరూమ్ ముందు వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామన ఛాయతో, కొద్దిగా బట్టతలతో ఉన్నాడు. మాసిన నలుపు రంగు ప్యాంట్, లేత నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై "మీనాక్షి" అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ప్రభుత్వ మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముస్తాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం!

ముస్తాబాద్, సెప్టెంబర్ 29: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు హిందూ దేవుళ్లను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ ముస్తాబాద్ మండల బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. మండల బీజేపీ అధ్యక్షుడు సౌళ్ళ క్రాంతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సౌళ్ళ క్రాంతి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా వ్యవహరించాల్సిన ముఖ్యమంత్రి, ఒక వర్గం ఓట్ల కోసం మెజారిటీ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విష్ణు భక్తుడని, శివుడిని పూజించరంటూ వ్యాఖ్యలు చేయడం చవకబారు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. శివుడిని పూజించే వారంతా ద్రవిడులు, విష్ణు భక్తులంతా ఆర్యులంటూ భారతీయులను విభజించేలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. మెజారిటీ హిందువుల మనోభావాలను కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు కేవలం రాజకీయ అంశంగా చూస్తున్నారని సౌళ్ళ క్రాంతి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మల్లారపు సంతోష్ రెడ్డి, చిట్నేని శ్రీనివాసరావు, డీటీ సత్తయ్య, గుండవేని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో 16 చెత్త సేకరణ ఆటోలు ప్రారంభం సహపంక్తి భోజనం

జనగామ, సెప్టెంబర్ 29 జనగామ మున్సిపాలిటీలో నూతనంగా కొనుగోలు చేసిన 16 చెత్త సేకరణ ఆటోల ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ శ్రీమతి శ్రీ కడకంచి బాలమణి శ్రీనివాస్ గారు మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్లు మరియు అధికారులకు ఘనంగా సహపంక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ గారు అందరితో కలిసి ఒకే పంక్తిలో కూర్చొని భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనమంతా ఒక కుటుంబం. జనగామ అభివృద్ధి కోసం అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది అందరం కలిసి కట్టుగా పని చేయాలి. ఈ సహపంక్తి భోజనం మనలో ఐక్యతను మరింత పెంచుతుంది అని అన్నారు.

## వనదేవతల చెంత 'ప్యారడైజ్' చిత్ర బృందం..

తాడ్వాయి నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్ర బృందం మంగళవారం ములుగు జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుంది. ఈ సందర్భంగా హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత చెరుకూరి సుధాకర్, నటుడు సంపూర్ణేష్ బాబు తదితరులు ఆదివాసీ ఆచార వ్యవహారాల ప్రకారం వనదేవతలకు పసుపు-కుంకుమలు, నిలువెత్తు బెల్లం (బంగారం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.మేడారానికి చేరుకున్న చిత్ర బృందానికి పూజారులు డోలు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. 'ది ప్యారడైజ్' చిత్రం ఘన విజయం సాధించాలని, భావితరా లకు ఉపయోగపడే మరిన్ని మంచి సినిమాలు తీసే శక్తిని ప్రసాదించాలని వనదేవతలను ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. మేడారం రాకముందు ములుగు సమీపంలోని ఘట్టమ్మ తల్లిని దర్శించుకుని తొలి మొక్కులు చెల్లించుకున్నారు. సినీ ప్రముఖుల రాకతో ములుగు నుంచి మేడారం వరకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అడ్డగోలు నిర్మాణాలు..

●సి.ఎం.సి పరిధిలో ఎటు చూసినా అక్రమ నిర్మాణాలే.

●ఒక పక్క మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపడుతున్నా, బిల్డర్లు మాత్రం బరితెగించి ఐ డోంట్ కేర్ అంటూ అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తూనే ఉన్నారు.

●కూల్చివేతల అనంతరం అధికారులు అక్రమ నిర్మాణాల వైపు మరలా దృష్టి సారించకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

●అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు, సీజింగ్ లు చేపట్టిన తర్వాత వారం రోజులు తిరగకముందే తిరిగి మరల పనులు ప్రారంభిస్తున్నారంటే బిల్డర్ల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

అభ్యుదయం. శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 30. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎటు చూసినా అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి ఒకపక్క అధికారులు కూల్చివేతలు చేపడుతున్నప్పటికీ వారం తిరగకముందే బిల్డర్లు తిరిగి మరల కూల్చివేసిన చోటే నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారంటే బిల్డర్ల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. కొన్ని సందర్భాల్లో అనుమతులు లేని నిర్మాణాలను అధికారులు సీజింగ్ చేస్తున్నప్పటికీ బయట సీజింగ్ చేసిన బ్యానర్ ఉండగానే లోపల జరగాల్సిన పనులన్నీ జరిగిపోతున్నాయి పని పూర్తయ్యి కలర్లు వేసాక అధికారులు పెట్టిన బ్యానర్ ని సైతం బిల్డర్లు తీసి చెత్త కుప్పలో పడేస్తున్నారు. రోజులకొద్దీ సమయం వెచ్చించి అధికార యంత్రాంగం మొత్తం భవనాన్ని అనుమతి లేనంతవరకు కూల్చివేతలు చేపట్టి తిరిగి మరలా అటువైపు చూడడం లేదు ఇదే అదునుగా ఒక్కసారి కూల్చివేశారు మరలా ఇటువైపు రారు అనే దీమాతో కూల్చివేసిన స్లాబులను బిల్డర్లు తిరిగి విధిగా స్లాబులను నిర్మిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించి పూర్తిస్థాయిలో కఠినమైన చర్యలు తీసుకోకపోతే అక్రమ నిర్మాణాలను నిర్మించే బిల్డర్ ల ఆగడాలకు అడ్డుకట్ట ఉండదని. జరుగుతున్న ఈ తతంగాన్ని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టి తగిన చర్యలు మరింత కఠినంగా తీసుకుంటే తప్ప ఈ అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు ఉండదని తద్వారా కొన్ని ప్రతికూల సందర్భాల్లో నిర్మాణాలు కూలిపోవడం ఒక్కోసారి ప్రాణనష్టం కూడా సంభవించడం జరుగుతుందని అలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలంటే కూల్చివేసిన నిర్మాణాలు పునర్నిర్మాణం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని లేకుంటే మరిన్ని ఊహించని సంఘటనలు చూడాల్సి వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మాదాపూర్ సర్కిల్ 50 పరిధిలోని మియాపూర్, న్యూ కాలనీలో అనుమతికి మించి అక్రమ నిర్మాణం.



సర్కిల్ 49 పరిధిలోని ప్రభుపాద లేఔట్ లో అనుమతికి మించి భారీ అక్రమ నిర్మాణం.



సర్కిల్ 48 పరిధిలో మియాపూర్, కృషి నగర్ లో అనుమతికి మించి భారీ అక్రమ నిర్మాణం.



సర్కిల్ 48 పరిధిలో మియాపూర్, వైశాలి నగర్ లో పాత భవనంపై అదనంగా అనుమతి లేని రెండు స్లాబ్ ల నిర్మాణం.

## అలారుదీన్నే విద్యా కమిటీ చైర్మన్‌గా ఆవుల రాజు వైస్ చైర్మన్‌గా చాకలి భారతి ఏకగ్రీవం

పాఠశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం: నూతన చైర్మన్ ఆవుల రాజు



దేవనకొండ, సెప్టెంబర్ 29 (రాయల టైమ్స్ న్యూస్):మండల పరిధిలోని అలారుదీన్నే గ్రామంలో విద్యా కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. టీడీపీ మద్దతుతో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో విద్యా కమిటీ చైర్మన్‌గా ఆవుల రాజు, వైస్ చైర్మన్‌గా చాకలి భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠ జ్యోతి ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా టీడీపీ గ్రామ నాయకులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో ఎన్నికలను సజావుగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రంగవల్లి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. నూతన చైర్మన్ ఆవుల రాజు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. విద్యా కమిటీ సభ్యులందరినీ కలుపుకొని సమష్టిగా పనిచేస్తామని అన్నారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను టీడీపీ నాయకులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు రామారావు నాయుడు, ఉచ్చీరప్ప, విజయ్‌కుమార్ గౌడ్, అశోక్, రామచంద్ర, అలాగే చిన్న గిడ్డయ్య, చాకలి నరసింహుడు, బజారి బోయ తిక్కయ్య, తాయ్యప్ప, గోవిందు, మల్లీ శివయ్య, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ



అభ్యుదయం - బాలానగర్ (సెప్టెంబర్ 29): పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉట్ల చంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు.

చంద్రారెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పరామర్శకు స్థానికులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

### అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదారాబాద్, సెప్టెంబర్ 29 తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు,ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## పాడి రైతులకు ప్రభుత్వం అండ 50 శాతం రాయితీపై సమీకృత దాణా

తక్కువ ధరకే నాణ్యమైన పశుదాణా రైతులు సద్వినియోగం చేసుకోవాలి పశువైద్యులు డా. బాలకృష్ణ

తుగ్గలి, సెప్టెంబర్ 29:పాడి రైతులకు దాణా ఖర్చు తగ్గించి, పశువులకు సమతుల్యమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమీకృత పశుదాణాను అందుబాటులోకి తీసుకొచ్చింది. తుగ్గలి మండలం లోని చెన్నంపల్లి గ్రామంలో రైతులకు ఈ రాయితీ దాణాను అందిస్తున్నట్లు మండల పశువైద్యులు డా. బాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వ రాయితీతో కిలో దాణా రూ. 11కే రైతులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 50 కిలోల దాణా ప్యాకెట్‌పై 50 శాతం సబ్సిడీ వర్తించడంతో రైతులు సబ్సిడీ పోను రూ. 555 మాత్రమే చెల్లించి దాణాను పొందవచ్చని వివరించారు.

పాడి రైతులకు ఎంతో ఉపయోగకరం

పశువులకు నాణ్యమైన దాణా అందించడం ద్వారా వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడే అవకాశం ఉంటుందని డా. బాల కృష్ణ తెలిపారు. ప్రస్తుతం పశు పోషణలో దాణా ఖర్చులు రైతులకు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీ పాడి రైతులకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన పశుపోషకులు ఈ రాయితీ దాణాను పొందవచ్చని తెలిపారు. దాణా అవసర మైన రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా పశువైద్య శాలను సంప్రదించి వివరాలు తెలుసుకుని ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

రైతులు తప్పక సద్విని యోగం చేసుకోవాలి

పాడి రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీని ప్రతి అర్హత కలిగిన పశుపోషకుడు సద్వినియోగం చేసుకోవాలని డా. బాలకృష్ణకోరారు. తక్కువ ధరకు నాణ్యమైన దాణా లభించడం వల్ల పశువుల పోషణ తో పాటు రైతులపై పడే దాణా ఖర్చు కూడా కొంతవరకు తగ్గ తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పశు వైద్య సహాయక సిబ్బంది మురళి, గోపాలమిత్ర దివాకర్ నాయుడు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 6న శ్రీ స్వామివారి హుండీల లెక్కింపు

భక్తులు, మీడియా ప్రతినిధులకు దేవస్థానం సమాచారంగుంతకల్లు అక్టోబర్ 6 రాయల టైమ్స్ న్యూస్: మంగళవారం రోజున కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణా ధికారి తెలిపారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తుల సమర్పణలతో కూడిన హుండీలను దేవస్థానం నిబంధనల ప్రకారం పారదర్శకంగా లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని భక్తులకు చేరేలా తమ పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కోరారు. శ్రీ స్వామివారి అనుగ్రహం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో కసాపురం దేవస్థానానికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆలయ అధికారులు కోరుతున్నారు.

## విద్యా కమిటీ ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తు ఎందుకు

-ఎమ్మిగనూరు మండలంలోని నాలుగు గ్రామాల్లో పోలీసుల మోహరింపుపై వైఎస్సార్‌సీపీ ప్రశ్నలు



ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల గ్రామాల్లో విద్యా కమిటీ ఎన్నికల సందర్భంగా భారీగా పోలీసు బలగాలను మోహరించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రశాంతంగా జరగాల్సిన విద్యా కమిటీ ఎన్నికలకు ఇంతటి పోలీసు బందోబస్తు ఎందుకని వారు ప్రశ్నించారు. ఆ నాలుగు గ్రామాలు బీహార్‌లో ఉన్నాయా అంటూ విమర్శించారు. కూటమి నేత బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి నేతృత్వంలో తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఎన్నికల వాతావరణం సృష్టించారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించాయి. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తారనే భయంతోనే ఇలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు--నేడు' కార్యక్రమం ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పాఠశాలల్లో కనిపిస్తున్న అభివృద్ధి తమ ప్రభుత్వాన్ని గుర్తు చేస్తోందని, అందుకే కూటమి నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. "ఎన్నికలు పోలీసుల బలంతో కాదు.. ప్రజల స్వేచ్ఛతో జరగాలి. భయంతో కాదు.. ప్రజల నమ్మకంతో గెలవాలి" అని వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి పేర్కొన్నారు.




# కోహ్లీని స్వేచ్ఛగా ఆడనిస్తే ఒంటిచేత్తో గెలిపిస్తాడు

## భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. తిరువనంతపురం వేదికగా పర్యాటక వెస్టిండీస్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ గిల్, స్టార్ ఆటగాడు కోహ్లీ శతకాలతో రెచ్చిపోయారు. ఫలితంగా ప్రత్యర్థి నిర్దేశించిన 295 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా 41.4 ఓవర్లలోనే చేరుకుంది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ గిల్ స్పందిస్తూ, మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్మన్ గిల్ మాట్లాడుతూ, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'విరాట్ భాయ్‌ను తన ఆటను ఆస్వాదించనివ్వాలి. అతడిని ఎలాంటి ఒత్తిడికి గురిచేయాల్సిన అవసరం లేదు. తనదైన రోజున ఎలాంటి మ్యాచ్‌నైనా ఒంటిచేత్తో గెలిపించగల సత్తా అతడికి ఉంది. ప్రస్తుతం కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు' అని గిల్ అన్నాడు.

ఇదే మ్యాచ్‌లో కోహ్లీ 15,000 వన్డే పరుగుల మైలురాయిని అందుకోవడం విశేషం. తన సెంచరీ సంతోషాన్నిచ్చినా, మ్యాచ్‌ను ముగించలేకపోయాననే స్వల్ప అసంతృప్తి ఉందని గిల్ వ్యాఖ్యానించాడు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ 88 బంతుల్లో 139 పరుగులు చేయగా, గిల్ 110 రన్స్ చేశారు. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యాన్ని దక్కించుకుంది

# ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ రికార్డ్ బ్రేక్..

## 5 రోజుల్లో 3మెడల్స్ గెలిచిన గుల్వీర్

సియా క్రీడల్లో భారత అథ్లెట్స్ పతకాల పంట పండిస్తున్నారు. మూడు పతకాలు సాధించిన రెండవ భారతీయ అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచారు. గతంలో ఈ చారిత్రాత్మక రికార్డు దిగ్గజ భారతీయ అథ్లెట్ పి.టి. ఉష పేరిట ఉండేది. పి.టి. ఉష 1986 సియోల్ ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని గెలుచుకున్నారు. 1986 ఆసియా క్రీడల తర్వాత మొదటిసారిగా ఒక భారతీయ క్రీడాకారుడు పతకాల హ్యాట్రిక్ సాధించాడు. ఆసియా క్రీడలలో గుల్వీర్ ప్రయాణం ఒక సినిమా కథను తలపించేలా సాగింది. అతను కేవలం ఐదు రోజుల్లోనే నాలుగు పరుగుల పోటీలలో పాల్గొన్నాడు. 1,500 మీటర్ల నుండి 10,000 మీటర్ల వరకు జరిగిన వివిధ ఈవెంట్లలో అతను ట్రాక్‌పైకి దిగి, ప్రతిసారీ పతకం సాధించాడు.గుల్వీర్ సాధించిన చారిత్రాత్మక హ్యాట్రిక్ పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంతో మొదలైంది. అతను ఈ పందెన్ని 28:29.38 నిమిషాల్లో పూర్తి చేసి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఆ తర్వాత 1,500 మీటర్ల పరుగులో 3:36.72 సమయంతో తన వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నమోదు చేసి మరో రజత పతకాన్ని సాధించాడు. వరుసగా మూడు రేసుల వల్ల కలిగిన ఒత్తిడి, అలసట ఉన్నప్పటికీ, గుల్వీర్ ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో 13:32.75 సమయంతో మూడవ స్థానంలో నిలిచి, అతను కాంస్య పతకాన్ని సాధించాడు. జపాన్‌లో ఐదు రోజుల్లో మూడు పతకాలు సాధించడం ద్వారా గుల్వీర్ భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించాడు. ఈ ఘనతతో భారత అథ్లెటిక్స్ చరిత్రలో అతని పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆసియా క్రీడల తర్వాత ఇప్పుడు ఒలింపిక్స్‌లోనూ అటువంటి ప్రదర్శనే చేసి భారత్ కోసం పతకం సాధించాలని గుల్వీర్ ఆశిస్తున్నాడు. ఆసియా ఒలింపిక్స్‌లో గుల్వీర్ సింగ్ రికార్డు బ్రేక్ చేయడమే కాకుండా వరుసగా నాలుగు పతకాలు సాధించడం పట్ల కేంద్ర



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. నీలాంటి వాళ్లు దేశఖ్యాతిని పెంచిన ఛాంపియన్స్ అంటూ కితాబిచ్చారు.

# మహిళల ట్రాప్ షూటింగ్‌లో భారత్‌కు తొలి వ్యక్తిగత స్వర్ణం!

ప్రస్తుత సీజన్‌లో భారత శిబిరంలో నెలకొన్న వ్యక్తిగత విభాగపు స్వర్ణ పతక లోటును భర్తీ చేస్తూ స్టార్ షూటర్ నీరూ దండా చరిత్ర సృష్టించారు. మహిళల ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో తిరుగులేని ప్రదర్శనతో అగ్రస్థానంలో నిలిచిన ఆమె, బంగారు పతకాన్ని ముద్దాడారు. ఈ విజయంతో 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఐదో స్వర్ణ పతకం లభించినట్లయింది. లక్ష్యాన్ని గురిచూసి కొట్టడంలో అద్భుత నైపుణ్యాన్ని కనబరిచిన నీరూ దండా ఫైనల్స్‌లో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. అంతకుముందు జరిగిన మహిళల ట్రాప్ షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ నీరూ రజత పతకం సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉన్నారు. ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత త్రయం అద్భుత సమన్వయంతో రజతాన్ని కైవసం చేసుకోగా, వ్యక్తిగత విభాగంలో నీరూ ఏకంగా స్వర్ణాన్ని సాధించి తన పతక స్థాయిని పెంచుకున్నారు. ఈ క్రీడల్లో అంతకుముందు భారత్ సాధించిన నాలుగు స్వర్ణాలు కూడా జట్టు విభాగాల్లోనే వచ్చాయి. మహిళల క్రికెట్ ఫైనల్ పోరులో హర్మన్‌ప్రీత్ సేన సాధించిన చారిత్రక విజయం దేశానికి తొలి పసిడిని అందించగా, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట రెండో బంగారు



పతకాన్ని సొంతం చేసుకుంది. ఇక సంప్రదాయ క్రీడ కబడ్డీలో పురుషుల, మహిళల జట్లు రెండూ ఎదురులేని ఆధిపత్యంతో బంగారు పతకాలను భారత్ ఖాతాలో చేర్చాయి. ఇప్పటివరకు వచ్చిన పసిడి పతకాలన్నీ టీమ్ ఈవెంట్స్‌లోనే కావడం గమనార్హం. అయితే నీరూ దండా సాధించిన ఈ విజయంతో వ్యక్తిగత విభాగంలోనూ భారత్‌కు స్వర్ణ బోణీ పడింది. ఈ విజయంతో పతకాల పట్టికలో భారత స్థానం మరింత మెరుగైంది. భారత్ ఒక స్థానం ముందుకు ఎగబాకి ప్రస్తుతం 11వ స్థానానికి చేరుకుంది. భారత్ ఖాతాలో ఇప్పటివరకు 5 స్వర్ణాలు, 21 రజతాలు, 21 కాంస్య పతకాలు కలిపి మొత్తం 47 పతకాలు చేరాయి. వ్యక్తిగత విభాగంలో చారిత్రక స్వర్ణం అందించిన నీరూ దండాపై దేశవ్యాప్తంగా క్రీడా వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# జట్టులోని వాతావరణం నచ్చకనే కోహ్లీ రిటైర్మెంట్

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. జట్టులోని వాతావరణం నచ్చకనే రిటైర్మెంట్ ప్రకటించాడని అభిప్రాయపడ్డాడు. గతేడాది తనకు ఎంతో ఇష్టమైన టెస్ట్ క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ ఆకస్మికంగా తప్పుకున్నాడు. అతని నిర్ణయం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అనేక సందేహాలకు తావిచ్చింది. తన నిర్ణయానికి ముందే విరాట్ కోహ్లీ రంజీ ట్రోఫీ ఆడాడు. టెస్ట్ క్రికెట్‌లో కొనసాగేందుకు ఆసక్తి చూపించాడు. కానీ అంతలోనే ఏమైందో ఏమో తెలియదు కానీ.. సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. మానసిక ఒత్తిడితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలు ఇంటర్వ్యూల్లో కోహ్లీ చెప్పాడు. తాజాగా కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. పరోక్షంగా గంభీర్‌పై ఆరోపణలు గుప్పించాడు.' టెస్ట్ రిటైర్మెంట్ గురించి విరాట్ కోహ్లీ ఇంటర్వ్యూలు



చూసినప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది. అతని ముఖంలో కొంత నిరాశ కనిపించింది. ఫామ్ బాగాలేకపోయినా.. అతను విరాట్ కోహ్లీ. వన్డేల్లో కూడా అతను ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడు. అతని ఇంటర్వ్యూలను బట్టి చూస్తే.. జట్టు వాతావరణం నచ్చకనే రిటైర్మెంట్ ప్రకటించినట్లు అనిపిస్తోంది. జట్టులో విరాట్ కోహ్లీకి తగిన ప్రాధాన్యత, మద్దతు లభించడం లేదని అతను భావించినట్లు అనిపించింది. అతను గనుక కొనసాగించి ఉంటే.. కచ్చితంగా పూర్వ వైభవం అందుకునేవాడని నా అభిప్రాయం. రీఎంట్రీకి అతను పెట్టింది పేరు.'అని కైఫ్ అభిప్రాయపడ్డాడు. టెస్ట్ క్రికెట్‌లో 10 వేల పరుగుల మైలురాయి అందుకోకూండానే విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించాడు. మరో 770 పరుగులు చేస్తే ఈ ఫీట్ సాధించేవాడు. తన కెరీర్‌లో 123 టెస్ట్‌లు ఆడిన కోహ్లీ 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలతో పాటు 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2011లో వెస్టిండీస్‌తో టెస్ట్ క్రికెట్ ప్రారంభించిన కోహ్లీ.. కెరీర్ ఆరంభంలో తడబడ్డాడు. జట్టులో కూడా చోటు కోల్పోయాడు. 2011-12 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో సత్తా చాటాడు. 2014లో ధోనీ వారుసుడిగా టెస్ట్ బాధ్యతలు అందుకున్నాడు. కోహ్లీ సారథ్యంలో భారత్ 68 మ్యాచ్‌లు ఆడి 40 విజయాలు సాధించింది. భారత మోస్ట్ సక్సెస్‌ఫుల్ టెస్ట్ కెప్టెన్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ కన్నా ముందు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించాడు.

# ర్యాంకింగ్స్‌లో శ్రీ చరణి సరికొత్త రికార్డు

భారత యువ స్పిన్నర్ శ్రీ చరణి ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కెరీర్‌లోనే అత్యుత్తమంగా 817 రేటింగ్ పాయింట్లకు చేరుకుంది. దీంతో 2018 నవంబర్‌లో ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ సాధించిన 806 పాయింట్ల రికార్డును అధిగమించింది. మహిళల టీ20 క్రికెట్లో మరే బౌలర్ ఇప్పటివరకు ఈ స్థాయిలో రేటింగ్ అందుకోలేదు.

ఇప్పటికే టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా ఉన్న చరణి.. ఇప్పుడు ఆ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో చరణి అద్భుతంగా రాణించింది. జపాన్‌పై 4/10తో కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసింది. అనంతరం



శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టింది. ఈ మ్యాచ్‌లో భారత్ 147 పరుగుల తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా కప్‌లోనూ చరణి కీలక పాత్ర పోషించింది. టోర్నీలో 12 వికెట్లు తీసుకుంది. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 4/20తో అదరగొట్టింది. దీంతో భారత్ 72 పరుగుల తేడాతో విజయం సాధించి ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్ దక్కించుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత మరో స్టార్ దీప్తి శర్మ కూడా ముందుకు వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో మూడు వికెట్లు తీసుకున్న ఆమె 754 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ 723 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన కూడా టాప్-5లోకి తిరిగి వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో శ్రీలంకపై 79 పరుగులు చేయడంతో ఆమెకు ఈ స్థానం దక్కింది.

## (సంపాదకీయం)

# పంటలపై ఎల్ నినో ప్రభావం!

ఎల్ నినో అంటే ఏమిటో అనుకున్నారు ఈ పేరు వినగానే ప్రజలు. కాని దాని ప్రభావం యావత్ ప్రపంచంపై కనిపిస్తుండడంతో ఎల్ నినో అంటే ఏంటో అర్థం అవుతుంది. నేడు ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పులకు కారణమయ్యే ఎల్ నినో ప్రభావం మరింత బలపడుతున్నట్లు తాజా అంచనాలు సూచిస్తున్నాయి. కొలంబియా యూనివర్సిటీకి చెందిన ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ సొసైటీ ఈ మధ్య విడుదల చేసిన అంచనా ప్రకారం.. 2026 చివరి నాటికి, 2027 ప్రారంభంలో ఎల్ నినో పరిస్థితులు "చాలా బలమైన" స్థాయిలో కొనసాగవచ్చు. ఈ పరిణామం ఆసియా దేశాలతో పాటు భారత్‌లోనూ వాతావరణ సంబంధిత ప్రమాదాలను పెంచే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఎల్ నినో బలాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే ముఖ్యమైన సూచికల్లో నినో 3.4 ఇండెక్స్ ఒకటి. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను ఇది సూచిస్తుంది. ఐఆర్ఐ ప్రకారం 2026 సెప్టెంబర్ మధ్య నాటికి నినో 3.4 సూచిక ం3.0 డిగ్రీల సెల్సియస్కు చేరింది. ఆగస్టు నెలలో ఇది ం2.52 డిగ్రీలుగా ఉండగా, సెప్టెంబర్ మధ్య నాటికి మరింత పెరగడం ఎల్ నినో తీవ్రత వేగంగా పెరుగుతున్న సంకేతంగా కనిపిస్తోంది. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. ఐఆర్ఐ పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో మరింత బలపడే అవకాశాన్ని సూచించాయి. ఇందులో 13 డైనమిక్ మోడళ్లు, 9 స్టాటిస్టికల్ మోడళ్లు ఉన్నాయి. ఈ మోడళ్లన్నీ 2026-27 శీతాకాలంలో ఎల్ నినో "వెరీ స్ట్రాంగ్" స్థాయిలో ఉండొచ్చని అంచనా వేశాయి. కొన్ని మోడళ్లు నినో 3.4 ఉష్ణోగ్రత అసాధారణత ం3.0 డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశాన్ని కూడా సూచిస్తున్నాయి.ఎల్ నినో పరిస్థితులు 2027లోనూ కొనసాగే అవకాశాలు ఉన్నాయని × పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో అంచనా వేస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ఉండే అవకాశం 100 శాతంగా ఉందని మోడల్ ఆధారిత అంచనా చెబుతోంది. 2027 మార్చి--మే కాలానికి ఈ అవకాశం 99 శాతంగా, ఏప్రిల్--జూన్ నాటికి 90 శాతంగా ఉండగా, మే--జూలై 2027లో 61 శాతానికి తగ్గుతుంది. అంటే 2027 మధ్య నాటికి ఎల్ నినో బలహీనపడే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం కొంతకాలం కొనసాగవచ్చని అర్థం. ఇదే సమయంలో ఇండియన్ ఓషన్ డైపోల్ ( పరిస్థితి కూడా భారత వాతావరణానికి కీలకంగా మారనుంది. పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో అంచనా ప్రకారం 2026 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పాజిటివ్ × పరిస్థితులు బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత 2027 జనవరి నుంచి మార్చి మధ్య తిరిగి తటస్థ పరిస్థితుల వైపు వెళ్లవచ్చని అంచనా. ఎల్ నినో, పాజిటివ్ ఒకేసారి కనిపించడం సాధారణమే అయినప్పటికీ.. ఈ రెండు వాతావరణ వ్యవస్థలు స్వతంత్రంగా కూడా అభివృద్ధి చెందవచ్చని పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఏడాది నెలకొన్న 'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే రబీ (శీతాకాల) సీజన్‌లో వర్షాధార ప్రాంతాల్లో సాగు సవాలుగా మారే అవకాశముందని, దీనివల్ల దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడొచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన రబీ సీజన్ సన్నద్ధత జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇప్పటికే ముగిసిన ఖరీఫ్ సీజన్ కూడా వర్షాధార ప్రాంతాల్లో తీవ్ర సవాళ్లతో కూడుకుని సాగిందని, అనేక రాష్ట్రాలు విత్తనాలు నాటడం నుంచి పంటను కాపాడుకునే వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని గుర్తుచేశారు. అక్టోబర్ నెల నుంచి గోధుమ, ఆవాలు వంటి ప్రధాన రబీ పంటల విత్తే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో నేలలో అధిక తేమ, మరికొన్ని వర్షాభావ ప్రాంతాల్లో సుదీర్ఘ పొడి వాతావరణం పంటలపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఆయా ప్రాంతాలకు తగినట్లుగా వ్యవసాయ వ్యూహాలను మార్చుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. దేశంలో సాధారణంగా 638 లక్షల హెక్టార్లలో రబీ సాగు జరుగుతుంది. ఇందులో సుమారు 300 లక్షల హెక్టార్లలో గోధుమలు, 140 లక్షల హెక్టార్లలో పప్పుధాన్యాలు, 87 లక్షల హెక్టార్లలో నూనెగింజలు మరియు 55 లక్షల హెక్టార్లలో ముతక ధాన్యాలు పండిస్తారు. ధాన్యాల ఉత్పత్తిలో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్ల దిగుమతులపై ఇంకా ఆధారపడుతోందని, దీనిని అధిగమించేందుకు 'పంటల వైవిధ్యీకరణ' అనివార్యమని ఆయన అన్నారు. 'ప్రతి చుక్కకూ అధిక పంట' మరియు నేల ఆరోగ్య కార్డుల వంటి సంక్షేమ పథకాలను కేవలం రాయితీల పంపిణీకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలలో ఉన్న లోపాలను సరిచేసి రైతుల ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ధాన్యాల ఉత్పత్తిలో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్ల దిగుమతులపై ఇంకా ఆధారపడుతోందని, దీనిని అధిగమించేందుకు 'పంటల వైవిధ్యీకరణ' అనివార్యమని ఆయన అన్నారు. 'ప్రతి చుక్కకూ అధిక పంట' మరియు నేల ఆరోగ్య కార్డుల వంటి సంక్షేమ పథకాలను కేవలం రాయితీల పంపిణీకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలలో ఉన్న లోపాలను సరిచేసి రైతుల ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనా ప్రభావం తగ్గి సమృద్ధిగా వర్షాలు పడాలని అందరూ కోరుకుంటున్నారు.

# మొబైల్ వినియోగదారులకు శుభవార్త..

అనవసర స్పామ్ కాల్స్‌తో మీరు విసిగిపోయారా..? మీరు బిజీగా ఉన్న సమయంలో స్పామ్ కాల్స్ డిస్టర్బ్ చేస్తున్నాయి. ఇకపై ఆ సమస్య ఉండదు. ఎందుకంటే ఈ స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారుల (వీశీఎఱశ్రీవ ఖంవతీం)కు ఊరటనిచ్చేలా టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ు=ూ×) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికామ్ సంస్థల ను ఆదేశించింది.




ఈ మేరకు 'టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్' లో నూతన నిబంధనలను పొందుపరిచింది. కొత్త నిబంధనల ప్రకారం.. టెలికామ్ కంపెనీలు తమ ఏఐ లేదా మెషీన్ లెర్నింగ్ వ్యవస్థల ద్వారా ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే.. ఆ సమాచారాన్ని రెండు గంటల్లోపు సంబంధిత ఆపరేటర్‌కు నివేదించాలి. సదరు ఆపరేటర్ ఒక వర్కింగ్ డే వ్యవధిలో ఆ నంబర్‌కు సంబంధించిన కేవైసీ వివరాలను సేకరించి, ఇతర టెలికామ్ సంస్థలతో పంచుకోవాలి. గడిచిన 10 రోజుల్లో ఒకే వ్యక్తి లేదా సంస్థకు చెందిన ఐదు కంటే ఎక్కువ నెంబర్‌లు స్పామ్‌గా నమోదైతే అన్ని టెలికామ్ సంస్థలు సమన్వయంతో కఠిన చర్యలు చేపడతాయి.

స్పామర్లపై కఠిన చర్యలను కూడా ట్రాయ్ ప్రతిపాదించింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజులపాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే ఆ నెంబర్లను ఏడాదిపాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికామ్ సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు. వినియోగదారుల సౌలభ్యం కోసం మరికొన్ని మార్పులను కూడా ట్రాయ్ సూచించింది.

# ఉగ్రవాదంపై భారత్ రెడ్‌లైన్ గీసుకుంది..

## అమెరికాకు జైశంకర్ ఇన్‌డైరెక్ట్ వార్నింగ్..!

భారత్-అమెరికా సంబంధాలపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని స్పష్టంచేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్ (=వం ూఱఅవ)' గీసుకుందని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్ (ూఱఅఱూఅ) పట్ల అమెరికా సానూకూల ధోరణి కనబరుస్తున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోం దంటూ పాకిస్థాన్ పేరును ప్రస్తావించకుండానే జైశంకర్ దుయ్యబట్టారు. అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే అది



కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుందని అన్నారు. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతోపాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ చెప్పారు. భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూక శ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలా పాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందు కుభారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఆయన గుర్తుచేశారు.

# ఆధునిక సాంకేతికత వైద్యులను భర్తీ చేస్తుందా..

### నిపుణులు ఏం చెబుతున్నారు..?

వైద్య రంగం కేవలం వ్యాధులను గుర్తించడం, చికిత్స అందించడానికే పరిమితం కాకుండా వేగంగా మారుతోంది. ఆసుపత్రుల్లో అపాయింట్‌మెంట్ బుకింగ్ నుంచి వైద్య రికార్డులను పొందడం, పరీక్షలు చేయించుకోవడం, చికిత్స తీసుకోవడం, డిశ్చార్జ్ తర్వాత వైద్యులతో సంప్రదింపులు కొనసాగించడం వరకు ప్రతి దశలో సాంకేతికత వినియోగం పెరుగుతోంది. ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు వైద్య సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం రావడంతో రోగుల అంచనాలు కూడా మారుతున్నాయి. చికిత్సకు సంబంధించిన స్పష్టమైన సమాచారం, ఖర్చుల్లో పారదర్శకత, ఆసుపత్రిలో సులభమైన అనుభవాన్ని వారు కోరుకుంటున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా ఆసుపత్రుల్లో డిజిటల్ సేవలు, అనుసంధానమైన వ్యవస్థలు, అధునాతన వైద్య సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి.

వైద్యులను భర్తీ చేస్తుందా..ఇకపై డిజిటల్ వైద్య సేవల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డుల ద్వారా రోగి ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలను వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో చికిత్సలోని వివిధ దశల్లో ఒకే సమాచారాన్ని పదేపదే సేకరించాల్సిన అవసరం తగ్గుతుంది. ఆసుపత్రి నమోదు, వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, చికిత్స, డిశ్చార్జ్ వంటి ప్రక్రియలను అనుసంధానించే వ్యవస్థలు కూడా పెరుగుతున్నాయి. అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడం, పరీక్షల నివేదికలను పొందడం వంటి



సేవలను రోగులు డిజిటల్‌గా ఉపయోగించుకునే అవకాశం పెరుగుతోంది. అయితే సాంకేతికత వైద్యులను భర్తీ చేయదని, వైద్యుల నిర్ణయ సామర్థ్యం, మానవీయత, రోగులతో సమర్థవంతమైన సంభాషణకు ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**నూతన సాంకేతికతలు కీలకం..**

వ్యాధుల నిర్ధారణలోనూ కొత్త సాంకేతికతలు కీలకంగా మారుతున్నాయి. అణు స్థాయి పరీక్షలు రోగి ఆరోగ్య పరిస్థితిపై మరింత వివరమైన సమాచారాన్ని అందిస్తాయి. దీంతో వ్యాధిని మరింత కచ్చితంగా అంచనా వేసి, రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను రూపొందించే అవకాశం ఉంటుంది. మరోవైపు రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలు, తక్కువ కోతలతో నిర్వహించే చికిత్సలు కూడా ఎంపిక చేసిన రోగులకు అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని శస్త్రచికిత్సల్లో చిన్న కోతల కారణంగా శరీరంపై గాయం తక్కువగా ఉండడం, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడం, త్వరగా కోలుకునే అవకాశం ఉండడం వంటి ప్రయోజనాలు ఉంటున్నాయి. అయితే ఇవి శస్త్రచికిత్స రకం, రోగి ఆరోగ్య పరిస్థితి, వైద్య బృందం నిర్ణయంపై ఆధారపడి ఉంటాయి.

**వేగంగా అందుతున్న వైద్య సేవలు..**

ఆసుపత్రిలోని వివిధ విభాగాల మధ్య మెరుగైన సమన్వయం ఏర్పడితే రోగులు ఎదురుచూసే సమయం కూడా తగ్గే అవకాశం ఉంది. అపాయింట్‌మెంట్లు, పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు ఒకదానితో ఒకటి అనుసంధానమైతే చికిత్స ప్రక్రియ మరింత సులభంగా సాగుతుంది. చికిత్స ఖర్చులు, బిల్లింగ్, బీమాకు సంబంధించిన వివరాల్లో పారదర్శకతకు కూడా భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించనుంది

. ముఖ్యంగా సంక్లిష్టమైన చికిత్సల్లో వైద్యుల ఫీజులు, పరీక్షలు, మందులు, శస్త్రచికిత్స, ఆసుపత్రిలో చేరడం, తదుపరి చికిత్స వంటి ఖర్చులపై స్పష్టమైన సమాచారం రోగులకు ఉపయోగపడుతుంది. అలాగే డిశ్చార్జ్‌తో వైద్య సంరక్షణ ముగిసిపోకుండా, హెల్ప్‌లైన్‌లు, డిజిటల్ సేవలు, వైద్య బృందాలతో నిరంతర సంప్రదింపుల ద్వారా ఫాలోఅప్, కోలుకునే విధానం, తదుపరి సంరక్షణను కొనసాగించే అవకాశం పెరుగుతోంది. సాంకేతికత, వైద్య నైపుణ్యం, అనుసంధానమైన ఆసుపత్రి వ్యవస్థలు కలిసి భవిష్యత్తులో రోగులకు మరింత సమాచారంతో కూడిన, సమన్వయం కలిగిన వైద్య అనుభవాన్ని అందించే దిశగా మార్పులు తీసుకురానున్నాయి.

# ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.4 శాతం

2025-26పై కేంద్ర ప్రభుత్వం ముందస్తు అంచనా

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతానికి ఎగబాకవచ్చని కేంద్రప్రభుత్వం అంచ నా వేసింది. వృద్ధిరేటు 7.3 శాతంగా నమోదు కావచ్చన్న ఆర్‌బీఐ అంచనాల కంటే ఇది అధికం. తయారీ, సేవల రం గాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడవచ్చని కేంద్ర గణాంకాల శాఖ బుధవారం విడుదల చేసిన ప్రథమ ముం దస్తు అంచనాల్లో తెలిపింది. తద్వారా భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థల్లో తన అగ్రస్థానాన్ని కొనసాగించనుంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరం లో స్థూల విలువ జోడింపు (జీవీఏ) 7.3 శాతంగా నమోదు కావచ్చు. తయారీ, నిర్మాణ రంగాలు 7% చొప్పున వృద్ధి చెందవచ్చని అంచనా. సేవల రంగం జీవీఏ 9.1% వృద్ధి చెందవచ్చని మంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. మనకు ప్రధాన పోటీ దేశమైన చైనా 2025లో 4.9%, 2026లో 4.4% వృద్ధిని నమోదు చేయవచ్చని ప్రపంచబ్యాంక్ ఈ మధ్యనే అంచనా వేసింది.




వ్యవసాయం డీలా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, సంబంధిత రంగాల జీవీఏ 3.1 శాతానికి తగ్గనుందని.. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవల రంగాల్లోనూ పరిమిత వృద్ధి నమోదు కావచ్చని కేంద్రం అభిప్రాయపడింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ లేదా నామినల్ జీడీపీ వృద్ధి రేటు 8% ఉండవచ్చని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) బడ్జెట్ రూపకల్పనలో కేంద్రం ఈ గణాంకాలను ఉపయోగించుకోనుంది. వచ్చేనెల 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

రూ.200 లక్షల కోట్లకు జీడీపీ

ఈ ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ రూ.201.90 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఆ శాఖ అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరపు ప్రాథమిక జీడీపీ అంచనా రూ.187.97 లక్షల కోట్లతో పో లిస్తే ఇది 7.4% అధికం. కాగా, 2024-25లో రూ.330.68 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న జీడీపీ..2025-26లో 8% వృద్ధి తో రూ.357.14 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం కేంద్రం నామినల్ జీడీపీ వృద్ధిని 10.1 శాతంగా అంచనా వేసిం ది. అమెరికా కరెన్సీలో ఈసారి మన జీడీపీ (డాలర్‌కు రూ.90 చొప్పున) 3.97 లక్షల కోట్ల డాలర్లుగా నమోదయ్యే అవకాశం ఉంది.

2026-27లో 6.8% వృద్ధి: గోల్డ్‌మన్ శాక్స్

రాబోయే ఆర్థిక సంవత్సరం లో మాత్రం భారత జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతానికి పరిమితం కావచ్చని అంతర్జాతీ య బ్రోకరేజీ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. అలాగే, ఈ ఏడాదిలో ధరల సూచీలు మళ్లీ ఎగబాకవచ్చని, దాంతో ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గించేందుకు అవకాశా లు సన్నగిల్లవచ్చని పేర్కొంది. ఈ ఏడాది లో ద్రవ్యోల్బణం సగటు 3.9 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది.

ఆర్థిక జోరు కొనసాగుతుంది..

ఈ ఏడాది కూడా ఆర్థిక వృద్ధి జోరు కొనసాగనుంది. భారత్‌పై అమెరికా సుంకాల ప్రభావం గతంలో అంచనా వేసిన దానికంటే కూడా తక్కు వే. దేశీయంగా అధిక వినియోగం, ప్రభుత్వ మూలధన వ్యయం వంటి సానుకూల అంశాలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ వృద్ధి రేటు 6.5-7% శ్రేణిలో నమోదు కావచ్చు. ఈ ఏడాది దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎ?అబశ్రీశ్రీఫడీఐ), విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ) పెరిగి రూపాయి బలోపేతానికి దోహదపడనున్నాయి. ప్రస్తుతం భారత్ గోల్డిలాక్స్ (అధిక వృద్ధి, కనిష్ఠ ద్రవ్యోల్బణ స్థితి) దశలో ఉంది. వచ్చే రెండేళ్లపాటు ఇది కొనసాగనుంది.




# స్వల్పంగా తగ్గిన బంగారం ధర..

వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు గురువారం కాస్త ఉపశమనం కలిగించాయి. స్వల్పంగా తగ్గుదల నమోదు చేశాయి. అయితే వెండి మాత్రం జోరు చూపిస్తూనే ఉంది. గురువారం కూడా పెరుగుదల నమోదు చేసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది.

ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండి

ఈ నేపథ్యంలో ఈ రోజు (జనవరి 8న) ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,38,260కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,26,740కి చేరింది ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,39,640కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,28,010కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. నిన్నటితో పోల్చుకుంటే కిలోకు వంద రూపాయల మేర పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం..

# జామపండును తొక్కతో తినాలా?




జామపండు చాలా మందికి ఇష్టమైన పండు. పోషకాలతో నిండిన ఈ పండును చాలా మంది 'సూపర్ ఫ్రూట్ణ అని అంటారు. అయితే జామపండును తొక్కతో తినాలా? లేక తొక్క తీసేసి తినాలా? అని ఎక్కువ మందికి సందేహం ఉంటుంది. ఈ విషయంపై పోషకాహార నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండి

నిపుణుల ప్రకారం, జామపండును తొక్కతో తింటే పొటాషియం, జింక్, విటమిన్ జ వంటి ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. అయితే దయాబెటిస్ ఉన్నవారు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు జామపండును తొక్క లేకుండా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే తొక్కతో తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

జామపండు ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

రోగనిరోధక శక్తి పెరుగుతుంది: జామపండులో విటమిన్ జ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది జలుబు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ ఇస్తుంది. ఒక జామపండు తింటే రోజుకు అవసరమైన విటమిన్ జ కంటే ఎక్కువే లభిస్తుంది.

జీర్ణక్రియ మెరుగవుతుంది: జామపండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది, మలబద్ధక సమస్యను తగ్గిస్తుంది.

చర్మానికి మెరుపు ఇస్తుంది: జామలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ూ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, ముడతలు రాకుండా సహాయపడతాయి.

గుండె ఆరోగ్యానికి మంచిది: పొటాషియం, మెగ్నీషియం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. క్రమం తప్పకుండా జామపండు తినేవారిలో బీపీ, కొలెస్ట్రాల్ తగ్గినట్లు పరిశోధనలు చెబుతున్నాయి.

మీకు దయాబెటిస్, కొలెస్ట్రాల్ సమస్యలు లేకపోతే జామపండును తొక్కతో తినొచ్చు. అలాంటి సమస్యలు ఉంటే తొక్క తీసేసి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# శీతాకాలంలో మీ ఊపిరితిత్తులను ఇలా కాపాడుకోండి..!

శీతాకాలం వచ్చిందంటే జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎక్కువవుతాయి. ఈ కాలంలో ఊపిరితిత్తులు బలహీనపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే చలికాలంలో ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



దే జాగ్రత్త పడండి

సాధారణంగా 20 ఏళ్ల వయస్సు వచ్చే సరికి ఊపిరితిత్తుల సామర్థ్యం గరిష్ఠ స్థాయికి చేరుతుంది. తర్వాత మన జీవనశైలి ఆధారంగా అది తగ్గవచ్చు. పెద్ద నగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ఆస్తమా, జ్వూణ వంటి సమస్యలు పెరుగుతున్నాయి.

రోజూ వ్యాయామం తప్పనిసరి

ఊపిరితిత్తులను బలంగా ఉంచుకోవాలంటే రోజూ వ్యాయామం చేయాలి. రోజుకు కనీసం 30 నిమిషాలపాటు వాకింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటివి చేయడం మంచిది. ఇలా చేస్తే ఊపిరితిత్తులు ఎక్కువ ఆక్సిజన్ తీసుకోవడం అలవాటు చేసుకుంటాయి. దీని వల్ల శ్వాసకోశ సామర్థ్యం పెరుగుతుంది. నెమ్మదిగా మొదలుపెట్టినా సరే, క్రమం తప్పకుండా చేయాలి. నవ్వడం వల్ల ఊపిరితిత్తుల్లోని పాత గాలి బయటకు వెళ్లి, తాజా గాలి లోపలికి చేరుతుంది. ఇది శ్వాస వ్యవస్థను చురుకుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది, మనసును ప్రశాంతంగా ఉంచుతుంది.

నీరు తాగండి

చలికాలంలో దాహం తక్కువగా అనిపిస్తుంది కాబట్టి చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. కానీ, నీరు తక్కువగా తాగితే కఫం మందంగా మారి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వస్తుంది. ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోయి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది బలంగా ఉన్నంత కాలం మీ జీవితం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శ్వాస నాణ్యతే జీవన నాణ్యత. కాబట్టి చలికాలంలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సరైన ఆహారం, వ్యాయామంతో వాటిని కాపాడుకోండి.




## శీతాకాలంలో డయాబెటిస్ కంట్రోల్‌లో ఉండాలంటే. .ఇలా చేయండి.!

శీతాకాలంలో వెచ్చదనాన్నిచ్చే ఫుడ్‌ను తినాలనిపిస్తుంది. ఎక్కువగా వేడి వేడి ఆహారాలు, స్వీట్లు ఎక్కువగా తీసుకుంటుంటారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. శీతాకాలంలో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచేందుకు తీసుకోవాల్సిన చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

ఔఅత్వతీ ూబస్త్రుతీ జత్మీుజఅఅస్త్రం: శీతాకాలంలో దయాబెటిస్ కంట్రోల్‌లో ఉండాలంటే..ఇలా చేయండి.!

శీతాకాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోతాయి. వేడి వేడి వంటకాలు, స్వీట్లు తినాలనే కోరిక ఎక్కువవుతుంది. దయాబెటిస్ ఉన్నవారికీ తీపి పదార్థాలు తినాలనిపిస్తుంది. కానీ, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. అందుకే ఈ కాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. శీతాకాలంలో శరీరానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. దీంతో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారం, తీపి పదార్థాలపై కోరిక పెరుగుతుంది. కానీ దయాబెటిస్ ఉన్నవారు తీపి తింటే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉంది. ఇది గుండె, కిడ్నీ సమస్యలకు కూడా దారి తీస్తుంది.

ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండి

ఏం చేయాలి..

డాక్టర్ సూచన మేరకు తీపి తినాలనిపిస్తే బెల్లం చాలా కొద్దిగా మాత్రమే తీసుకోండి. ఆపిల్, బేరి, జామ వంటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లు తినండి. రోజుకు ఒక ఖర్జూరం తీసుకోవచ్చు. భోజనంలో ప్రొటీన్ ఉండేలా చూసుకోండి. పప్పులు, శెనగలు, మొలకెత్తిన ధాన్యాలు, సలాడ్లు తీసుకోవడం మంచిది. ఎక్కువసేపు ఆకలితో ఉండకండి. ఒకేసారి ఎక్కువగా తినకుండా, పరిమితంగా తినడం అలవాటు చేసుకోండి.



# తిన్న వెంటనే నీళ్లు తాగితే ఏమవుతుంది?

హారం, నీరు రెండూ మన ఆరోగ్యానికి చాలా అవసరం. కానీ, వాటిని సరైన సమయంలో తీసుకోవడం ముఖ్యం. చాలా మందికి భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. అయితే ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఈ అలవాటు జీర్ణక్రియకు మంచిది కాదు. దీని వల్ల కడుపు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మన శరీరం ఆహారాన్ని జీర్ణం చేయడానికి ప్రత్యేక జీర్ణ రసాలను ఉత్పత్తి చేస్తుంది. తిన్న వెంటనే నీరు తాగితే ఈ రసాలు నీరుగా మారి, వాటి పని సరిగ్గా జరగదు. దీని వల్ల అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండి

తిన్న తర్వాత ఎంతసేపటికి నీళ్లు తాగాలి?

నిపుణుల ప్రకారం, భోజనం చేసిన 30 నుంచి 45 నిమిషాల తర్వాత నీరు తాగడం మంచిది. భోజనం చేసే ముందు నీరు తాగాలనుకుంటే, అరగంట ముందు తాగాలి. ఇలా చేస్తే ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది, శరీరానికి పోషకాలు బాగా చేరుతాయి.

తిన్న వెంటనే నీళ్లు తాగితే వచ్చే సమస్యలు

జీర్ణక్రియ బలహీనపడుతుంది: ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం వల్ల అజీర్ణం, గ్యాస్, కడుపు నొప్పి వస్తాయి. ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే విటమిన్లు, ఖనిజాలు శరీరానికి పూర్తిగా అందవు. దీని వల్ల బలహీనత, అలసట రావొచ్చు.

కడుపు బరువుగా అనిపిస్తుంది: నీరు తాగడంతో కడుపు ఉష్ణోగ్రత తగ్గి, ఆహారం ఆలస్యంగా జీర్ణమవుతుంది.



# రకుల్ ప్రీత్ సింగ్‌పై ఐటీ దాడులు..

ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ గారు, ప్రముఖ నిర్మాత వషు భగ్నానీ, వారికి సంబంధించిన పనోరమ స్టూడియోస్‌తోపాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఏకకాలంలో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు నిర్వర్తిస్తున్నారు. ముంబైలో సోదాలు వ్యవహారం బయటకు రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్ సినీ పరిశ్రమలోని ప్రముఖులు ఉలిక్కిపడ్డారు. రకుల్ ప్రీత్ ఫ్యామిలీ నివాసాలు, కార్యాలయాలపై దాడులు నిర్వహించడం వెనుక కారణాలను ఆరా తీశారు. ఈ వ్యవహారం బాలీవుడ్ మీడియాలో కలకలం రేపింది. రకుల్ ప్రీత్ సింగ్, ఆమె భర్త జాకీ భగ్నానీ, వషు భగ్నానీపై ఆదాయపు పన్ను ఎగవేత, నిధుల నిర్వాహణలో అవతకవలు, మనీ లాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారంటూ వారి భాగస్వాములు, పెట్టుబడి దారులు ఆరోపణలు, ఫిర్యాదు చేయడంతో ముంబై ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అంటే సెప్టెంబర్ 28వ తేదీ ఉదయం నుంచే ఐటీ అధికారులు ముంబైలోని పలు ప్రదేశాల్లో దాడుల చేసి సోదాలు చేస్తున్నారు. వారి నిధులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ వ్యవహారాలు, ఓవర్సీస్‌లో ఫైనాన్షియల్ ట్రాన్స్‌జాక్షన్ వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. జాతీయ టెలివిజన్ ఛానెల్ ఎన్డీటీవీ వెల్లడించిన కథనం ప్రకారం.. సినిమాల నిర్మాణానికి సంబంధించి ఫైనాన్స్ వ్యవహారాలు, విదేశాలకు అక్రమంగా తరలించిన డబ్బు విషయంపై వెలుగు చూసిన అవకతవకల గురించి, ఇతర ఫైనాన్స్ వ్యత్యాసాల గురించి ప్రశ్నిస్తున్నారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు అని తెలిపింది. అయితే ఈ దాడులకు సంబంధించిన వివరాలు అందాల్సి ఉంది. ఈ రైడ్స్‌పై రకుల్ గానీ, భగ్నానీ కుటుంబం గానీ స్పందించలేదు. వషు భగ్నానీ విషయానికి వస్తే.. బాలీవుడ్‌లో అగ్ర నిర్మాతగా పేరు సంపాదించారు. ఆయన పూజా ఫిలింస్ అనే బ్యానర్‌పై పలు చిత్రాలను నిర్మించారు. పంపిణీ రంగంలో కూడా ఉన్నారు. అయన కుమారుడు ప్రస్తుతం తమ సంస్థ వ్యవహారాలను చూసుకొంటున్నారు.

# ఆచీతూచీ పాత్రలవైపు జాన్వీ కపూర్ అడుగులు



జాన్వీ కపూర్ ప్రస్తుతం ఆచీతూచీ పాత్రలను ఎంచుకుంటున్నారు. పెద్ది చిత్రం విడుదలైన తర్వాత, ఆమె హైదరాబాద్‌లోని ప్రచార కార్యక్రమాలకు, బహిరంగ వేదికలకు దూరంగానే ఉంటున్నారు. పెద్ది చిత్రంలో తన పాత్రను, ముఖ్యంగా గ్లామరస్ కోణంలో చూపించిన విధానం పట్ల జాన్వీ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే, ఆ సినిమాకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాల్గొనడాన్ని పరిమితం చేసుకున్నారు. బాలీవుడ్‌లో కూడా జాన్వీ శరవేగంగా ప్రాజెక్ట్‌లకు సైన్ చేసేలా కనిపించడం లేదు. ఆమె తన కెరీర్ తదుపరి దశను అంచనా వేయడానికి సమయాన్ని వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. సాంప్రదాయిక ఆకర్షణీయమైన, వాణిజ్య పాత్రలకు మించి కనిపిస్తుందిఇంకా బలమైన పాత్రలను అందించే మరిన్ని పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పార్ట్‌లను తీసుకోవడానికి ఆసక్తి చూపుతుందని తెలుస్తోంది. ఆమె అల్లు అర్జున్ రాకాకు సంతకం చేసిందని టాక్ వస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో ఆమె ప్రమేయం గురించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. ప్రస్తుతానికి, జాన్వి తన కెరీర్ ఎంపికల విషయంలో మరింత జాగ్రత్త తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# డబుల్ ఇస్మార్ట్‌తో 35 కోట్ల నష్టం




డబుల్ ఇస్మార్ట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఎదురైన ఆర్థిక సవాళ్లు మరియు మానసిక ఒత్తిళ్ల గురించి చైతన్య రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పూరీ జగన్నాథ్, చార్మిల మాటలు నమ్మి సహకరించామని, కానీ సినిమా విడుదలయ్యాక తమను పూర్తిగా పక్కన పెట్టారని హనుమాన్ సినిమా నిర్మాత చైతన్య రెడ్డి ఆరోపించారు. ఈ పరిణామాల వల్ల తీవ్ర డిప్రెషన్‌కు గురై పరిశ్రమ నుంచి వైదొలగాలని కూడా భావించినట్లు చెప్పారు.అయినప్పటికీ, నటుడు సాయి దుర్గా తేజ్, కుటుంబ సభ్యుల మద్దతుతో ఆ కష్టకాలం నుంచి బయటపడ్డామని ఆమె తెలిపారు. పరిశ్రమలో ఇతరులు ఇటువంటి సమస్యలను ఎదుర్కోకూడదనే ఉద్దేశంతోనే ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఎలక్షన్స్‌లో కూడా పోటీ చేసినట్లు స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరగాలనేదే తమ ప్రధాన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఆమె హిట్ టీవీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రైమ్ షో బ్యానర్ కేవలం సినిమాల నిర్మాణమే కాదు.. డిస్ట్రిబ్యూషన్ రంగంలో కూడా యాక్టివ్‌గా ఉన్నాం. హనుమాన్ సినిమా తర్వాత మేము డబుల్ ఇస్మార్ట్ మూవీ రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకొన్నాం. అయితే పూరి జగన్నాథ్, చార్మీ రిక్వెస్ట్ మేరకు నిర్మాత నిరంజన్ రెడ్డి సినిమాను చంపకూడదు అనే ఉద్దేశంతో ఆ సినిమా తీసుకొన్నాం. డబుల్ ఇస్మార్ట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ విషయంలో మా మధ్య ఓ అగ్రిమెంట్ జరిగింది. వారి పాత సినిమాలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే వారే అడ్జస్ట్ చేయాలి అని ఒప్పందం జరిగింది అని తెలిపారు. అయితే డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15వ తేదీన రిలీజ్ డేట్ పెట్టారు. మా అగ్రిమెంట్ చేసుకొన్న ప్రకారం.. ఎలాంటి సమస్య వచ్చినా మేము సపోర్ట్ చేస్తామని చెప్పారు. కానీ ఆగస్టు 10వ తేదీ వరకు కూడా డిస్ట్రిబ్యూటర్లు పాత సినిమా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సినిమా రిలీజ్‌కు సమస్యలు ఏర్పడ్డాయి. దాదాపు 25 కోట్ల రూపాయలు అప్పటికే చెల్లించాం. అయినప్పటికీ ఆ సినిమా నుంచి తప్పుకోవాలని డిసైడ్ అయ్యాం. ఆ సమయంలో మీరు చెల్లించిన డబ్బుకు ఏదో ఒక ఏరియా సర్దుబాటు చేసుకోమని సలహా ఇచ్చారు. దాంతో నేను ఆ సినిమా డిస్ట్రిబ్యూషన్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకొన్నాం. కానీ ప్రతీ రోజు పూరీ, చార్మీ ఫోన్ చేసి గంటపాటు మమ్మల్ని కన్విన్స్ చేసే ప్రయత్నం చేశారు. మీరు సినిమాను రిలీజ్ చేయకపోతే మా చచ్చిపోవాల్సిందే. మా జీవితాలు నాశనం అవుతాయి. ఇక మేము సినిమాలు చేయలేని పరిస్థితి అంటూ నిరంజన్‌ను ఉక్కిరి బిక్కిరి చేశారు. అయితే నిరంజన్ రెడ్డి నాకు కాల్ చేస్తే.. నేను సినిమాకు డబ్బు ఇవ్వను, చెక్‌పైనా సంతకాలు పెట్టనని చెబితే.. అప్పుడు ఆగస్టు 13వ తేదీన చార్మీ కాల్ చేసింది.ఈ సినిమా రిలీజ్‌కు ఎలాంటి సమస్య వచ్చిన మా తల తాకట్టు పెడుతాం. మీరు కాదంటే మేము చచ్చిపోవడమే ఉంటుం దని అన్నారు. అయినా వారి మాటలపై మాకు నమ్మకం కలుగలేదు అని చైతన్య రెడ్డి చెప్పారు.

# క్రేజ్ పెంచేసిన సత్యదేవ్ సమవర్తి టీజర్




సత్యదేవ్ హీరోగా "సమవర్తి" అనే ఇంట్రెస్టింగ్ సినిమాలో నటిస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ ౘ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన "సమవర్తి" టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ టీజర్ కు ఇప్పటిదాకా కోటికి పైగా డిజిటల్ వ్యూస్ దక్కాయి. "సమవర్తి" టీజర్ బిజినెస్ సర్కిల్స్ లో మూవీపై క్రేజ్ పెంచేసింది. ఈ సినిమాకు భారీ స్థాయిలో బిజినెస్ ఎంక్వైరీస్ జరుగుతున్నాయి. టీజర్ లో పరిచయం చేసిన "సమవర్తి" ప్రపంచం ప్రతి ఒక్కరినీ మెస్మరైజ్ చేస్తోంది. సత్యదేవ్ కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందనే అంచనాలు టీజర్ తోనే ఏర్పడ్డాయి. మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరిన్ని ఎగ్జైటింగ్ అప్డేట్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు "సమవర్తి" టీమ్ సన్నద్ధమవుతోంది. నటీనటులు – సత్యదేవ్, శ్రీకాంత్, దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్, తదితరులు

# కామ్రేడ్ కళ్యాణ్ రివల్యూషనరీ సాంగ్

శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు.శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నటీనటులు: శ్రీవిష్ణు, మహిమా నంబియార్, రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే






# జైలర్ 2 లో అనిరుధ్ జైలర్ టైటిల్ ట్రాక్

2023లో విజయవంతమైన చిత్రం 'జైలర్'కు సీక్వెల్ అయిన 'జైలర్ 2' కోసం ఉత్సాహం పెరుగుతోంది. ఈ చిత్రంలో రజనీకాంత్ ముత్తువేల్ 'టైగర్' పాండియన్ పాత్రలో నటించగా, విద్యా బాలన్ మరియు ఇతరులు ఆయనతో పాటు నటిస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 15, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీని ప్రమోషన్లలో భాగంగా సెప్టెంబర్ 29-30 తేదీలలో 'వన్ నేమ్' లిరిక్ వీడియో, అక్టోబర్ 5న ఒక గ్రాండ్ ట్రైలర్, మరియు ప్రత్యేక ఫ్యాన్ ఈవెంట్‌లు జరగనున్నాయి. కన్నడ డబ్బింగ్ ముగింపు దశకు చేరుకుంటుండగా జరుగుతుండగామరియు వ్యక్తిగత సంభాషణల వీడియోలను పంచుకుంటున్నారు.